

# అర్ణవంలో స్వర్ణ ద్వారక

**మూలంలో కాలయవన నారద సంవాదం కానరాదు. జరాసంధుని చివరి- 18వ దాడికి ముందు 'నారద ప్రేషితో వీరో యవనో ప్రత్యదృశ్యత'- నారదుడు పంపిన యవన వీరుడు కనిపించాడని మాత్రమే ఉంది. కాని, తెలుగులో- యవనుడు కోరగా నారద ముని గావించిన మారజనకుని, యదువీరుని సింగారపు స్వరూప స్వభావ వర్ణన అమాత్యుని ఇంపెసలారే- అందమైన పెంపుదలగా వెలుగు చూసింది. జగత్కల్యాణ కారకుడైన కలహప్రియుడు నారదుడు కాలయవనునితో..**

**సీ|| 'నీల జీమూత సన్నిభ శరీరము వాడు,
తామరసాభ నేత్రముల వాడు|
పూర్ణేందు బింబంబు బోలెడి మోము వా,
డున్నత దీర్ఘ బాహువుల వాడు|
శ్రీవత్స లాంఛనాంచిత మహోరము వాడు,
కౌస్తుభ మణి పదకంబు వాడు|
శ్రీకర పీత కౌశేయ చేలము వాడు,
మకర కుండల దీప్తి మలయు వాడు|
తే|| రాజ! ఇంతింత వాడనరాని వాడు
మెఱసి దిక్కుల నెల్లను మెరయు వాడు
తెలిసి యే వేళలందైన దిరుగు వాడు
పట్ట నేర్చిన కాని లోబడని వాడు'...**

'యవనేశ్వరా! ఆ భువనేశ్వరుడు నీల మేఘశ్యాముడు. నాళీక- కమలాల వంటి కన్నులు కలవాడు. పూర్ణచంద్రుని వంటి మోము వాడు. ఆజానుబాహువు. శ్రీవత్సమనే పుట్టుమచ్చతో చూపట్టు (కనిపించు) విశాలమైన వక్షఃస్థలం కలవాడు. కంఠంలో కౌస్తుభమణి కాంతులీనుతూ ఉంటుంది. సంపత్కరమైన పసుపు పచ్చని పట్టు పుట్టాలు ఆకట్టుకుంటాయి. చెవులలో మకర కుండలాలు చెలువు (అందం)గా కరము (మిక్కిలి) వెలుగుతుంటాయి. ఇంతవాడు, అంతవాడని ఎంతవాడైనా కొంతైనా చెప్పలేని వింత పోకడలతో అంతుచిక్కని వాడు. తాను వెలుగుతూ అన్ని దిక్కులను వెలుగుతో నింపువాడు. త్రికాలా బాధ్యుడు- అన్ని వేళలలో అంతటా వర్తించు- వసించు సర్వవ్యాపకుడు. పట్ట నేర్చిన వానికే కాని లోపడని- పట్టుబడని, లోగుట్టు తెలియని వాడు'.

శుకముని- అవనీపతీ! నారదముని ఇలా కృష్ణుని రూపురేఖలు వర్ణించగా విని యవనుడు- 'ముని పుంగవా! యాదవుడనగా ఎంతవాడు? ప్రళయాంతకుడైనా తల ఒగ్గక నన్నెదిరిస్తే కదనంలో అతనిని నా నిశితమైన అస్త్రాల అగ్గిమంటలలో బుగ్గి చేస్తా' అని నారదునితో వీరోక్తులాడి, మూడు కోట్ల మ్లేచ్ఛ (మలేచ్ఛులే- మలమును ఆశించువారే మ్లేచ్ఛులు) వీరులను కూర్చుకొని మథురాపురిని ముట్టడించాడు. అది కని (చూచి) అనిరుద్ధుడు (ఎవ్వని చేతనూ అడ్డగింపబడని) కృష్ణుడు బలరామునితో ఇలాగని ఆలోచించాడు... 'అన్నా! కాలయవనుడు అకాలంలో నగరాన్ని ఆక్రమించాడు. ఈ రోజో, రేపో మగధ రాజు కూడ మనపై దాడి చేయవచ్చు. కాలయవన జరాసంధులిద్దరూ చాలా గద్దరులు- గర్వపోతులు. వారు పురానికి ఇరువైపులా చేరి పోరు సలుపుతారు. మనం శక్తి కొలదీ ఒకడిని ఢీకొంటే, మరొకడు సందు చూసుకొని మన బంధువులందరినీ పట్టి చంపవచ్చు లేదా పట్టుకుపోయి చెర బెట్టవచ్చు. జరాసంధుని పరాక్రమం అతిక్రూరం. కనుక, పోరుకు వీలుగాని తీరుగా దుర్గమ (చొరరాని) ప్రదేశంలో ఒక దుర్గం- కోట కట్టించుకొని, అందులో మన వారందరినీ చేర్చుదాము.' ఇలా పరామర్శించి మురారి సాగరుని అడిగి పశ్చిమ వారిధి (సముద్రం) మధ్యలో పన్నెండు ఆమడల (8 లేక 10 మైళ్ల దూరం) పొడవు, అంతే వెడల్పు గల దుర్గమ ప్రదేశాన్ని సంపాదించి, మధ్యలో దేవశిల్పి విశ్వకర్మచే ఒక అపురూపమైన పురం నిర్మించుకొన్నాడు. ఆ నగరం వరుణుని శ్రద్ధావతి, ఇంద్రుని అమరావతి, కుబేరుని అలకాపురి, యముని సంయమనీ నగరాల కంటె, ఇంకా బ్రహ్మదేవుని సత్యలోకం కంటె సుదృఢమైనది. అదే ద్వారకా నగరం- నిరంజనుని నిత్య నివాసం. పరమాత్ముని పరంధామం. నవద్వారాలు కలిగి ఉన్న మానవ దేహమే సాధన ధామము, మోక్ష ద్వారమూ అయిన ద్వారక. విశేషంగా, శిరస్సుపై ఉన్న దశమ రంధ్రం బ్రహ్మరంధ్రం. అదే బ్రహ్మ ప్రవేశ ద్వారం. ఆ ద్వారం కలిగినదే ద్వారవతి- ద్వారక! శ్రీకృష్ణావతార లీలా ప్రారంభ స్థలి వ్రజ భూమి- గోకుల బృందావనం. లీలా సంవరణ- సమాపన స్థలి కుశస్థలి- ద్వారక. 'దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా' (విష్ణు సహస్ర నామం)- దుర్లభమూ, దుర్గమమూ అయిన దుర్గమే ద్వారక! సాగర మధ్యంలో దుర్గం. అందున సర్వాశ్చర్యకరమైన నగరం. అర్ణవం (సముద్రం)లో స్వర్ణద్వారక. సృష్టిలోని వాస్తుకళ, విజ్ఞాన ప్రజ్ఞానానికి పరాకాష్ఠ!


**క|| 'శ్రీకరములు జన హృదయ వ
శీకరములు మందపవన శీర్ణ మహాంభ
శ్శీకరములు హంస విహం
గాకరములు నగరి కువలయాబ్జాకరముల్'**

ఆ ద్వారకాపురిలోని సరస్సులు కలువలు, కమలాల శోభతో కళకళ్లాడుతుంటాయి. అవి పురజనుల హృదయాలను వశీకరించుకొని పరవశింపజేస్తాయి. పిల్లగాలులచే చెదరగొట్ట బడుచున్న చల్లని నీటి తుంపరల జల్లులతో విలసిల్లుతూ- ఒప్పుతూ, కలహంస, సారస (బెగ్గురు) మొదలైన విహంగా (పక్షు)ల విహారాలకు నిలయాలై ఉల్లములను ఉల్లసింప- రంజిల్ల చేస్తుంటాయి.' ఇది మొదలు ఇక ముందటి 'కంద నవకము' నందు- తొమ్మిది కంద పద్యాలలో ముకుందుని ద్వారకా నగర అందచందాలను, అధ్యాత్మ సంపదలను కవి చందురుడు పోతన సుందరంగా పొందుపరచాడు.

**క|| 'ఆ వీటి నుండు వారికి
భావింపగ లేవు క్షుత్పిపాసాదులు త
ద్గోవింద కృపావశమున
దేవ ప్రతిమానులగుచు దీపింతురిలన్'**

ఆ ద్వారకలోని ప్రజలకు క్షుత్పిపాసలు- ఆకలిదప్పులు ఉండవు. కృపారసం పైన చల్లే నల్లని వాని- కృష్ణుని చల్లని చూపులతో వారెల్లరూ దేవతలతో సమానంగా తేజరిల్లుతూ ఉంటారు.

**సీ|| 'ఆసక్తి కృష్ణ ముఖావలోకనమంద,
హరిపాద సేవన మంద చింత|
వెఱపు నారాయణ విముఖ కార్యములంద,
పారవశ్యము విష్ణుభక్తియంద|
బాష్ప నిరతి చక్రి పద్య సంస్తుతులంద,
పక్షపాతము శార్ఙ్గి భక్తులంద|
లేమి గోవిందాన్య లీలా చరణ మంద,
శ్రమము గోవింద పూజనములంద|
తే|| బంధ మచ్యుతేతర దుష్ట పథములంద
జ్వరము మాధవ విరహిత క్షణములంద
మచ్చరము లీశ కైంకర్యమతములంద
నరవరోత్తమ! వినుము తన్నాగరులకు.'**



మన పోతన మధురిమ 204 వ భాగం

శుకుడు.. 'పరీక్షిన్మహారాజా! ద్వారకావాసులకు వాసుదేవుని వదనారవింద సందర్శన మందే ధ్యాస (ధ్యానం). యాదవ శిరోరత్నం- మాధవుని పదారవింద సేవ యందే వారి యావ (ఆసక్తి). పరమాత్మకు ప్రతికూలమైన కృతులు- పనులంటేనే వారికి అతిభయం. దానవారి- అసురాంతకుని అసలైన భక్తియందే వారికి పారవశ్యం- వెరపులేని మైమరుపు. శ్రీకృష్ణుని పద్యాలతో- స్తోత్రాలతో కీర్తించే సమయంలో వారి కళ్లలో ఆనందబాష్పాలు పరవళ్లు తొక్కుతాయి తప్ప, వారు లౌకికమైన మరి దేనికీ కన్నీళ్లు పెట్టరు. కైటభారి శౌరి- కృష్ణుని భక్తుల యందే వారికి అవ్వారి- భూరిగా గౌరవాభిమానాలు. దైవేతర- సాంసారిక కార్యాలలో తప్ప, దైవ- కంసారి కృష్ణుని కార్యాలలో లేమిడి- లోటు, దారిద్ర్యం రానివ్వరు. వారి శ్రమ అంతా ఉరుక్రముని- కృష్ణుని పూజించడంలోనే. దామోదరుని దరి- సమీపానికి చేర్చలేని చెడు మార్గాలే వారికి చెర- బంధం. మాధవుని క్షణకాల వియోగం కూడా వారికి జ్వరం- తీవ్ర సంతాప కారణం. పురుషోత్తముని పరిచర్యలు- సేవలు చేయడంలోనే వారికి పట్టుదల.' మన మనోబుద్ధులు, మన దైనందిన ఆచార వ్యవహారాలూ ఇలా ఉంటే, మనం ద్వారకలో దామోదరుని సన్నిధిలో ఉన్నట్లే! పోతన గారి పై సొంత సీస పద్యం ఆయన నిశ్చింత ప్రశాంత దైనిక 'చారుచర్య'కు తీరుగా- చక్కగా అద్దం పడుతుంది.

మథురానాథుడు శ్రీహరికి మహేంద్రుడు పారిజాత వృక్షాన్ని, 'సుధర్మ' అను దేవసభను కానుకగా ఇచ్చాడు. కృష్ణుడు తన యోగశక్తిచే మథురా నగర ప్రజలందరినీ ద్వారకకు చేర్చాడు. అనంతరం అన్నగారి అనుమతితో 'సర్వప్రహరణాయుధుడు' (పరమాత్మ అస్త్రశస్త్రాలకు మితి లేదు. ప్రహరించే- దెబ్బతీసే అన్ని వస్తువులు ఆయనకు ఆయుధాలే!) అచ్యుతుడు నిరాయుధుడై నగరం వెలువడి తనకు ఎదురుగా రావడం కాలయవనుడు చూచాడు.

**కం|| 'విభులగు బ్రహ్మ ప్రముఖుల
కభిముఖుడై నడవకుండు నట్టి గుణాఢ్యం
డిభరాజ గమన మొప్పగ
నభిముఖుడై నడిచె గాలయవనున కధిపా!'**

శుకుడు- రాజా! బ్రహ్మాది దేవతలకు కూడా అభిముఖం- ఎదురుగా నడవని, అనంత కల్యాణ గుణ సంపన్నుడైన నారాయణుడు ఇభరాజ- కరిరాజు నడక వంటి నడకతో కాలయవనునికి ఎదురుగా నడిచాడు. మూలంలో 'దురాపమపి యోగినాం' (యోగులకు కూడా దుర్లభుడు) అని మాత్రమే ఉన్న మాటని పై కందంలో మన అమాత్యుడు పోతన్న, తన కవన చేతన కన్న విధంగా తేనె ఊటగా ఇలా తేట పరచాడు. నారదుడు సూచించిన సారసాక్షుడు (పద్మనేత్రుడు) సోముని వంటి మోముగల రామానుజుడు శూరుడు వీడే అని నిర్ధారించుకొని కాలయవనుడు మిక్కిలి కావరం (మదం)తో, ఆలము- అనాదరం చేస్తూ వ్యాల (కాళీయ) మర్దనుని పట్టుకోవాలని మిడిసిపడ్డాడు. ఇలా తనను పట్టడానికై యవనుడు రాగా నవకంజ లోచనుడు, నందుపట్టి కేశవుడు పట్టుపడకుండా దిక్కులు పిక్కటిల్లేటట్లుగా మిక్కిలి వడిగా పరుగెత్తసాగాడు. (సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

# మాయను అధిగమిస్తేనే..

దైవీహ్యేషా గుణమయీ మమమాయా దురత్యయా|
మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే||
(భగవద్గీత 7-14)

'అర్జునా! నా మాయ త్రిగుణాత్మకమైనది, అలౌకికమైనది. సాధారణంగా దానిని అధిగమించడం సాధ్యం కానిది. అయినా ఎవరైతే నిరంతరం నన్నే ధ్యానిస్తారో వారు ఆ మాయను అధిగమించి జననమరణ చక్రబంధనాల నుంచి తరించగలరు' అంటున్నాడు కృష్ణుడు.

సత్వరజస్తమో గుణాలు అనే మూడు దారాలతో అల్లినది ఈ ప్రకృతి. అయితే ఆ ప్రకృతి భగవంతుడిలో భాగమవుతుందా? ఎలాగైతే సూర్యుడి నుంచి వచ్చిన సూర్యరశ్మి సూర్యుడి నుంచి వేరుకాదో.. అలాగే భగవంతుడి నుంచి ఆవిష్కృతమైన ప్రకృతి కూడా భగవంతుడిలో భాగమే కాని, భిన్నమైనది కాదు. భగవంతుడు అనే ఆద్యం, అనంతమైన చైతన్యం సంకల్పంతో ఆవిష్కృతమైనది మాయ, అహంకారం, పంచభూతాత్మకమైన ప్రకృతి. నిరాకార చైతన్యం సాకారమైన ప్రకృతిగా పరివర్తన చెందే ప్రక్రియలో వెలుగు చూసేవే మాయ.. అహంకారాదులు. అహంకారం ఉనికికి ప్రతీక. నేను నాది అనేది దాని ధర్మం. 'నేను' అనేది భగవత్ చైతన్యం.. 'నాది' అనేది జీవచైతన్యం. 'నేను' అనబడే భగవంతుడి నుంచి 'నాది' అనబడే వెలుగు ప్రసరిస్తుంది. ఆ వెలుగునే ప్రకృతి అంటారు. భగవంతుడి నుంచి ప్రసరించిన వెలుగు భగవంతుడిలో భాగమే అయినా దానికి భిన్నంగా భావించడమే మాయ, కనిపించడమే అహంకారం. ఆ మాయను దాటడం అసాధ్యంకాదు కాని కష్టసాధ్యం అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరైతే ప్రకృతిలో ఉన్న సమస్త భేదభావనల్లోనూ భగవంతుడి ప్రతీకయైన 'నేను'ను దర్శిస్తూ.. ధ్యానిస్తూ.. భగవంతుడికి సర్వసమర్పణ భావనతో తనను తాను సమర్పించుకుంటారో వారికి మాయను అధిగమించడం సాధ్యపడుతుంది.

సంస్థను భగవంతుడు అనుకుంటే.. సంస్థను ఆశ్రయించి వెలుగు చూసేవే.. మాయ, అహంభావం, ప్రకృతులు. అహంభావం ఉత్పత్తిగా, ఉద్యోగులు, సరఫరాదారులు, కొనుగోలుదారులను ప్రకృతిగా చెప్పుకొంటే.. సంస్థ ఉనికిని గుర్తించలేని అహంభావాదులు మాయగా చెప్పుకోవచ్చు. సంస్థ ఉంటేనే యాజమాన్యం, ఉద్యోగులు, సరఫరాదారులు, కొనుగోలుదారులకు ఉనికి. సంస్థ వెలుగే వాటన్నిటినీ ప్రకాశింపజేస్తుంది. సూర్యుడు లేకపోతే సూర్యరశ్మి లేనట్లే సంస్థ లేకపోతే వాటికీ ఉనికి లేదు, వెలుగూ లేదు. సంస్థలో ఒకరు ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు.. అంతమాత్రాన 'నేనే' అనుకుంటే అది భ్రమ మాత్రమే. అది అహంభావాన్ని పెంచుతుంది. భ్రమ మాయ అనే ముసుగును కప్పుతుంది. అహంభావ పూరిత నిర్ణయాలు పక్షపాత దృష్టికి ఆశ్రయమిస్తాయి. అహంభావం వల్ల సంక్లిష్ట సమస్యలపై పరిమిత దృష్టి అలవడి సహకారం, సమన్వయం కొరవడి అవగాహనను తగ్గిస్తాయి. ఫలితాపేక్షపై అనురాగం పెరిగి వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, అధికార లాలసత రాజ్యం చేస్తాయి. దానితో సంస్థ ప్రయోజనాలకన్నా స్వప్రయోజనాలకే పెద్దపీట వేయడానికి మొగ్గుచూపుతారు. దానివల్ల సత్యాన్ని గుర్తించలేక అపజయాలను పొందవచ్చు. అపరిమితమైన సమాచారాన్ని సేకరించడం కూడా మాయ ఫలితమే. దానివల్ల ప్రభావవంతమైన నిర్ణయాలు తీసుకోవడంలో కలవరపాటు, విభ్రమ కలగవచ్చు. పారదర్శకత కనుమరుగై వ్యక్తి కేంద్రమైన వ్యవస్థలు ఏర్పడి ఒకరిపట్ల మరొకరికి అనుమానాలు, వ్యతిరిక్తతలు, అసహనాలతో సంస్థను నిర్వీర్యం చేయవచ్చు.

సంస్థలో నాయకుడు పెద్దపెద్ద విద్యార్హతలు కలిగి ఉండవచ్చు.. అన్నీ నాకే తెలుసనే అహంభావం పొడ చూపవచ్చు. దానివల్ల ఆయన ఫలితం సాధించలేడు. సంస్థ గెలుపు బృందం గెలుపుపై ఆధారపడి ఉంటుంది..




కార్య సాఫల్యతపై దృష్టిని కేంద్రీకరించ గలిగిన ఉద్యోగుల సహకారం, ప్రతిభావంతులు, అనుభవజ్ఞుల మార్గదర్శకత్వం అవసరం అవుతుంది. స్పష్టతతో కూడిన దార్శనికత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అధికంగా కలిగిన యువతరం నైపుణ్యాలు అవసరమవుతాయి. అన్ని విభాగాలను సమన్వయం చేయగలిగే పాటవం కలిగిన వారే సంస్థను ప్రగతి మార్గంలో నడిపించ గలుగుతారు. అందరి మధ్య సయోధ్య, సమన్వయం సాధిస్తేనే విజయం సిద్ధిస్తుంది. ఫలితాలకు అతుక్కుపోయి కార్యాలను నిర్వహించడం ఉపయుక్తం కాదు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకొని అహంభావాదులను అతిక్రమించి, తమకూ సంస్థకూ అభేదంగా భావిస్తూ.. సంస్థ శ్రేయస్సే తమ శ్రేయస్సుగా తపిస్తూ.. పరస్పర విశ్వాసం, పారదర్శకత ప్రాతిపదికగా ఉమ్మడి లక్ష్యాలకై సర్వసమర్పణ భావనతో ఉద్యమిస్తేనే అత్యున్నత స్థాయికి చేరుకుంటారు.

... పాలకుర్తి రామమూర్తి

కథాసుధ

# శ్రేయోభిలాషి



ఒక ఇంజినీరింగ్ విద్యార్థికి క్యాంపస్ సెలక్షన్‌లో మంచి ప్యాకేజీతో ఉద్యోగం లభించింది. అప్పటివరకు అంత భారీ ప్యాకేజీ వచ్చిన వారు అతని బంధుమిత్రులలో ఎవ్వరూ లేరు. ఆ విషయాన్ని అందరితో పంచుకోవాలని హాస్టల్ నుంచి గ్రామంలోని ఇంటికి బయలుదేరాడు. వెళ్తూ వెళ్తూ స్వీట్లు కూడా తీసుకుని వెళ్లాడు. అతని తల్లిదండ్రులు రైతులు. కొడుక్కు ఉద్యోగం వచ్చిందన్న వార్త విని వాళ్లు ఎంతో సంతోషించారు. తల్లి కొన్ని స్వీట్లు కొడుకు చేతికి ఇచ్చి ఊళ్లో బంధుమిత్రులకు పంచి ఉద్యోగ విషయం చెప్పి రమ్మంది. ఎగురుకుంటూ ఊళ్లోకి నడిచాడు. అమ్మ చెప్పినట్టే సన్నిహితులను కలిసి విషయం చెప్పి స్వీట్లు పంచాడు. ఇంటికి వచ్చేలోగా బాగా పొద్దుపోయింది. తిన్నామంటే తిన్నామన్నట్టుగా తిని ఇంటి పెరట్లో కూర్చుని ఆకాశం వైపు చూస్తూ కూర్చున్నాడు యువకుడు. కొడుకు ఎంతసేపైనా నిద్రపోకుండా ఏదో ఆలోచిస్తూ ఉండటం గమనించింది తల్లి. దగ్గరికి వెళ్లి, పక్కన కూర్చుని 'ఎందుకలా ఉన్నావు? ఎవరైనా ఏమైనా అన్నారా?' అని ప్రశ్నించింది. కొడుకు వాడిన ముఖంతో 'అదేమీ లేదు, అందరూ అభినందించారు. అయితే వారి మాటల్లో నేను వారికన్నా గొప్పోడిని అయిపోతానేమోననే అసూయ స్పష్టంగా కనిపించింది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. 'ఎదుటివాడు నాకన్నా గొప్పవాడు కావాలి' అని మనస్ఫూర్తిగా కోరుకునే వారు ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఉండరా... అనే ఆలోచన నాలో మొదలయ్యింది. అలాంటి సహృదయులు కనబడితే పాద నమస్కారం చేయాలని ఉంది. ఆ ఆలోచనలతో నిద్ర పట్టడం లేదు' అని సమాధానం ఇచ్చాడు. తల్లి చిన్నగా నవ్వి 'అయితే నువ్వు పాద నమస్కారం చేయాల్సింది నీ తండ్రికి. కన్నతండ్రి మాత్రమే నువ్వు అనుకున్నట్టు కోరుకుంటాడు. కొడుకును చూసి ఏ తండ్రీ అసూయపడడు. ఇంకా తనకన్నా తన కొడుకు మరింత ఎదగాలని, తనకన్నా గొప్పవాడు కావాలని పరితపిస్తాడు. దానికోసం ఎన్ని త్యాగాలైనా చేయడానికి సిద్ధపడతాడు' అని చెప్పింది. తండ్రి పాదాలకు నమస్కరించడానికి ఆ యువ ఇంజినీర్ చిన్నగా అక్కడినుంచి కదిలాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

# అన్నమయ్య నోట శతకం




తాళ్లపాక అన్నమాచార్యులు అంటే వేలాది కీర్తనలతో వేంకటేశ్వర స్వామిని వినుతించిన సంగతే చాలామందికి తెలుసు. కానీ ఆయన కీర్తనలే కాకుండా శతకాలు, ద్విపదలు ఇలా చాలా రచనలే చేశారు. వాటిలో ఒకటి 'వేంకటేశ్వర శతకం'. అన్నమయ్య తొలిసారిగా తిరుమలను తన పదహారో ఏట దర్శించుకున్నట్టుగా చెబుతారు. తిరుమలకు మెట్లదారిలో సాగుతుండగా మోకాళ్ల ముడుపు దగ్గర ఆయన అలసటతో మైమరిచి నిద్రలోకి జారుకున్నాడు. అప్పుడు అన్నమయ్య పాదరక్షలు ధరించి ఉన్నాడు. ఆ సమయంలో ఆయనకు కలలో అలమేలు మంగమ్మ దర్శనమిచ్చింది. అలసి సొమ్మసిల్లిన అన్నమయ్యను అమ్మవారు కలలోనే ఊరడించింది. పాదరక్షలు విడిచి కొండను ఎక్కమని సూచించింది. స్వామివారి దివ్యప్రసాదాన్ని తినడానికి ఇచ్చి ఆచార్యుల ఆకలి తీర్చి అంతర్ధానమైంది. ఇంతలో మెలకువ వచ్చిన అన్నమయ్య కలలో జరిగిందానికి కలవరపడ్డాడు. తాను చూసింది నిజమో కాదో అని సంశయించాడు. చివరికి 'వేంకటేశ్వరా!' ముద్రతో ఆశువుగా ఏకంగా ఓ శతకాన్నే చెప్పాడు. ఈ శతకంలో ప్రతి పద్యం చివర వేంకటేశ్వర మకుటమే ఉన్నప్పటికీ దీన్ని అలమేలు మంగకు అంకితమివ్వడం విశేషం. దీనికి నిదర్శనం శతకం చివరి పద్యమైన 'అమ్మకు తాళ్ళపాక ఘనుడన్నడు పద్యశతంబు జెప్పె గో/ కొమ్మని...' అంటూ సంబోధించడంలో వెల్లడవుతుంది.

# అనుసరించిన మరణం

అన్ని విషయాల్లో ప్రభువులా ప్రవర్తించిన శిష్యరికం గాని, అపోస్తులిజం గానీ చివరికి ప్రభువు లాంటి మరణాన్నే అభిలషించింది. ప్రభువు వాక్కు ప్రకటించడానికి దశ దిశలా వెళ్లిన శిష్యులు గానీ, అపోస్తులు గానీ, ఎక్కడెక్కడో తెలియని మారుమూలల్లో, ఇంకా చెప్పాలంటే హీనమైన, దిక్కుమాలిన పరిస్థితుల్లో హింసితులై ఇష్టంగానే చనిపోయారన్నది కఠోర సత్యం. ప్రభువుకు ఉన్నది పన్నెండు మందితో ఉన్న శిష్యరికం. ఆ పన్నెండు మందిలో మొట్టమొదట బలవన్మరణం తెచ్చుకొని ప్రాణాలు పోగొట్టుకొన్నది ఇస్కరియోతు యూదా అని అందరికీ తెలిసిందే. ఆయన ఆనాటి యూదా మత పెద్దల కుట్రల్లో చిక్కుకొని, ధనాశకు లోనై అమ్ముడుపోయి, ప్రభువును పట్టిచ్చాడు. ధనాశతో స్వామి ద్రోహం చేశానని పశ్చాత్తాపం చెంది పొలంలోకి పోయి చెట్టుకు ఉరి వేసుకొని రక్తం కక్కుకొని మరణించాడు. మిగిలిన పదకొండు మంది, ప్రభువార్తలు ప్రకటించడానికై వెళ్లిన అపోస్తుల్లో కొందరు హింసలకు గురై చనిపోయారు. మరి కొందరు ప్రభువు కోసం హింసల్ని ఆహ్వానించుకొని ప్రాణాలు విడిచారు. వారైనా వీరైనా దాదాపు శిలువ మరణంలోనే ప్రభువును అనుసరించి తరించారు. ఇక్కడ గమనార్హమైన విషయం ఏమంటే, శిష్యులు వేరు. అపోస్తులు వేరు!! శిష్యుల్లో అపోస్తులు ఉండొచ్చునేమో గానీ అపోస్తుల్లో శిష్యులు మాత్రమే ఉండనవసరం లేదు. ప్రభువు చుట్టూ తిరుగుతూ ప్రభువునే అనుసరిస్తూ ప్రభువుకు తోడుగా నడచిన వారు శిష్యులు. 'మీరు వెళ్లి, నేను తెలిపిన ఈ సత్యాల్ని లోకమంతటా విస్తరింప చేయండి' అన్న ప్రభు ఆదేశాన్ని తమతమ భుజస్కంధాలపై మోసుకుపోయి ఆ శుభవార్తలను ప్రజలకు అందించడానికి ప్రత్యేకంగా పంపబడిన వారు అపోస్తులు. ప్రభువును హింసించిన పౌలు.. క్రీస్తుకు శిష్యుడు కాడు. కానీ, మారిన తరువాత ప్రభు వాక్కును పంచడానికై దూర తీరాలకు వెళ్లాడు. అపోస్తుల్లోనే ఆద్యుడైన వ్యక్తిగా, వాక్‌శక్తిగా ఎదిగాడు. పేతురు స్వయంగా శిష్యాగ్రణి అయితే. పౌలును మాత్రం వాక్ ప్రచార అగ్రణిగా లోకం గణించింది.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024

క్రీస్తు సందేశం

